రోడ్లపైనే ప్రకటన బోర్డులు

- ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఇరుకుగా మారుతున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



మంథని బ్లాక్‌లో రోడ్డుపైన ఉంచిన వస్తువులు



హౌసింగ్‌బోర్డు వెళ్లే దారిలో రోడ్లపై ప్రకటన బోర్డులు

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పలు వీధుల్లో షాపులకు చెందిన వ్యాపారులు రోడ్లను ఆక్రమించి ప్రకటన బోర్డులు, విక్రయ వస్తువులను రోడ్డుపైనే ఉంచుతున్నారు. దీంతో రహదారి ఇరుకుగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులకు నడిచేందుకు ఖాళీ స్థలం కూడా లేకుండా పోతుంది. ఎదురెదురుగా వచ్చే వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు.

పలు కాలనీల్లో ఇదే దుస్థితి ..

పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, మంథనిబ్లాక్, కమాలనెహ్రూ కాలనీ, మహాలక్ష్మీ రోడ్డు, మామిడిపల్లి,పెర్కిట్ రహదారులపై వ్యాపారులు పోటీగా తమ షాపులకు చెందిన ఫ్లెక్సీలు, సైన్స్‌బోర్డులు, వస్తువులు రోడ్డుపైనే ఉంచుతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వినియోగదారుల వాహనాల పార్కింగ్ కూడా రోడ్లపైనే చేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

అధికారులు స్పందించాలి

ప్రకటన బోర్డులు, వ్యాపారస్తుల వస్తువులను రోడ్లపై ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్న మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ప్రకటన బోర్డులను తొలగించాలి

మున్సిపల్ పరిధిలో దుకాణాలకు చెందిన ప్రకటన బోర్డులు, వస్తువులను రోడ్లపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బోర్డులను తొలగించాలి.

– శ్రీకాంత్, ఆర్మూర్

జరిమానా విధిస్తాం

ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కల్గించేవిధంగా రోడ్లపై వస్తువులు, ప్రకటన బోర్డు ఏర్పాటు చేయొద్దు. వ్యాపారస్తులు తమ దుకాణానికి సంబంధించిన వస్తువులు, ప్రకటన బోర్డులు తమ పరిధిలో ఏర్పాటు చేసుకోవాలి. ఒకవేళ రోడ్లపై ఏర్పాటు చేస్తే జరిమానా విధిస్తాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్

వర్షాల కోసం గ్రామ దేవతలకు పూజలు





రామన్నపేట్‌లో గ్రామ దేవతలను అభిషేకించడానికి జలం తీసుకెళ్తున్న గ్రామస్తులు, జానకంపేట గ్రామంలో..

వేల్పూర్/బోధన్ : వర్షాలు కురవాలని వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామాభివృద్ధికమిటీ ఆధ్వర్యంలో, ఎడపల్లి మండలం జానకంపేట గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పవిత్ర గోదావరి నీటితో జలాభిషేకం చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిపించాలని గ్రామ దేవతలను వేడుకున్నారు.గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

బోనం ఎత్తిన విద్యార్థినులు



విజేత వొకేషనల్ కళాశాలలో బోనం ఎత్తుకున్న విద్యార్థినులు



మామిడిపల్లిలో పోతురాజుల వేషధారణలో ..



భీమ్‌గల్‌లో అమ్మవారి వేషధారణలో ..

మాక్లూర్/ఆర్మూర్/మోర్తాడ్/పెర్కిట్ : పాఠశాలల్లో బోనాల పండుగ ఘనంగా జరిగింది. మాక్లూర్ మండలంలోని అమ్రాద్ ప్రభుత్వ పాఠశాలలో, భీమ్‌గల్‌లోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో, ఆర్మూర్‌లోని విజేత వొకేషనల్ జూనియర్ కళాశాలలో, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి కృష్ణవేణి పాఠశాలలో బోనాల పండుగ సందర్భంగా శుక్రవారం విద్యార్థినులు బోనాలు ఎత్తుకున్నారు. పోతరాజులు, శివసత్తువుల వేషధారణలతో విద్యార్థినులు బోనాలను ఊరేగించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు సురేశ్, రాధాకృష్ణన్, ప్రిన్సిపల్ నరసింహచారి, మహమ్మద్ మీన్హాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అమ్రాద్ ప్రభుత్వ పాఠశాలలో బోనాలు ఎత్తుకున్న విద్యార్థినులు

క్లుప్తంగా

బీసీ రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు పెట్టాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ జెడ్పీ చైర్మన్ విఠల్ రావు అన్నారు. శుక్రవారం డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి వచ్చిన ఆయన వేంకటేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఆమోదంతోనే రిజర్వేషన్లు అమలు చేయాలని, లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు గుణపాఠం చెప్తారన్నారు. కాంగ్రెస్ నాయకులు వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రమణారావు, అంజయ్య, పురుషోత్తం, తిరుపతిరెడ్డి, ప్రవీణ్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విజేత కళాశాలలో 2016–18 సంవత్సరంలో ఎంఏ తెలుగు చదివిన గడ్డం రాజేశేఖర్, 2017–19 సంవత్సరంలో ఉల్లింగాల సత్తమ్మ, 2020–22 సంవత్సరంలో సృజనలు తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రెండో స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారని కరస్పాండెంట్ సంజీవ్ అన్నారు.ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం ఈవిద్యార్థులను అభినందించి సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంజారాలకు ప్రాధాన్యత ఇవ్వాలి



నవీపేట : స్థానిక ఎన్నికల్లో బంజారాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షులు బాబురామ్ నాయక్ కోరారు. మండల కేంద్రంలోని ఎంఎల్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన బంజారా సేవా సంఘ్ మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు తగిన టికెట్లను కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కమిటీ ప్రతినిధులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘ్ జిల్లా గౌరవాధ్యక్షులు చంద్రూ నాయక్, ప్రధాన కార్యదర్శి గంగాధర్‌నాయక్, మండల అధ్యక్షులు బాదావత్ గణేష్, ప్రధాన కార్యదర్శి అంబర్‌సింగ్, ఫకీరా, కృష్ణ, రమేష్, ప్రేమ్‌సింగ్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పెర్కిట్(ఆర్మూర్): గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలని ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథ్ అన్నారు. ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విజ్ఞానానికి సంబంధించిన వేయి పుస్తకాలతో గ్రంథాలయాన్ని హెచ్‌ఎం ప్రారంభించారు. లైబ్రరీ ఇన్‌చార్జీ నాగరాజు, ప్రైమరీ హెచ్‌ఎం విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

స్థానిక గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఎన్నిక



బోధన్: పట్టణ కేంద్రంలోని స్థానిక గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెండి పోశెట్టి, ఉపాధ్యక్షుడిగా బొంతల సాయిలు, ప్రధాన కార్యదర్శి తోపారం లింగం ,సహాయ కార్యదర్శిగా వెండి దత్తు, కోశాధికారి వెండి నగేష్, కార్యవర్గ సభ్యులుగా పర్వయ్య, వెండి గంగారాం, కుంటోల సాయిలు, దూపల్లి గంగాధర్, మల్లారం శంకర్, వెండి పెద్ద సాయిలు ను ఎన్నుకున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా బోధన్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోట అబ్బయ్య, మాగిరి గంగాధర్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని సూచించారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి



ర్యాలీలో పాల్గొన్న బోధన్ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

బోధన్: ప్రభుత్వం పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో విద్యార్థుల మహా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జీజేసీ నుంచి పట్టణ ప్రధాన రహదారుల్లో ప్రదర్శనను కొనసాగించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌతం కుమార్, డాక్టర్ కర్క గణేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి బాధకరమని పేర్కొన్నారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రూ.200 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.పీడిఎస్‌యూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గౌతం కుమార్, డాక్టర్ కర్క గణేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి ,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేశ్,ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు మోసిన్, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు,నాయకులు నసీర్, సృజన్,దినేష్, సాయినాథ్, శ్రీకాంత్,శంకర్, రాజన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 23న విద్యాసంస్థలు బంద్

ఆర్మూర్‌టౌన్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 23న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీయూస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. పట్టణంలోని సీవీరామన్ కళాశాలలో వామ పక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ నాయకులు నిఖిల్, నాయకులు, నిఖిల్, ప్రిన్స్, పాషా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం ఆలూర్‌తో పాటు దేగాం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆలూర్‌కు చెందిన ముగ్గురికి రూ.1.14 లక్షలు, దేగాంకు చెందిన నలుగురు బాధితులకు మంజూరైన రూ.1.10 లక్షల చెక్కులను నాయకులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, నాయకులు ఉప్పునూతుల శ్రీనివాస్ గౌడ్, ముత్యం రెడ్డి, మోతీరాం, సీహెచ్ గంగాధర్, సాయి, మల్లేష్, చింటు, నర్సయ్య, నరేందర్, గంగారాజన్న, గంగారాం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలి



వర్ని/మోర్తాడ్ : ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని మోస్రా మండల ప్రత్యేక అధికారి రమేశ్ లబ్దిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చింతకుంట తిమ్మాపూర్ గ్రామాల్లో ప్రత్యేక అధికారి పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల పరిశీలించారు. ఇంటింటికి తిరిగి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని జాగిర్యాల్‌లో ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ పరిశీలించారు. నిబంధనల ప్రకారమే ఇండ్లను నిర్మించుకోవాలని తెలిపారు. ఎంపీవో జావిద్ అలీ, ఎంపీవో నర్సయ్య, కార్యదర్శి అర్చన, కాంగ్రెస్ నాయకులు చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

సర్‌ప్లస్ చేసిన వాహనాలపై నిర్లక్ష్యం



ట్రాక్టర్‌పై మొలకెత్తిన చెట్టు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ప్రాజెక్ట్ అధికారులు సర్‌ప్లస్ చేసిన వాహనాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రాజెక్ట్ కాలనీ నీటి సరఫరా కోసం వినియోగించిన ట్యాంకర్, స్కూల్ పిల్లల కోసం వినియోగించిన బస్సు, ఇతర పనుల కోసం వినియోగించిన ట్రాక్టర్, టిప్పర్‌లను గత 15 ఏళ్ల క్రితం అధికారులు సర్‌ప్లస్ చేశారు. పెద్ద పెద్ద చెట్లు వాహనాలపై మొలకెత్తాయి. ప్రాజెక్ట్ ఉన్నత అధికారులు స్పందించి సర్‌ప్లస్ వాహనాలకు టెండర్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

రెండేళ్ల తర్వాత రోడ్డు నిర్మాణం పూర్తి



మెండోరాలో వేసిన తారు రోడ్డు

బాల్కొండ: మెండోరాలో రోడ్డు వెడల్పు, రోడ్డు డివైడర్ పనుల్లో భాగంగా చేపట్టిన తారు రోడ్డు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి.దీంతో మండల కేంద్ర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2023లో రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేసింది. అసెంబ్లీ ఎన్నికల వరకు ప నులు సాగి నిలిచిపోవడంతో కాంగ్రెస్ పార్టీ ని యోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను వెంట తీసుకుని వచ్చి పర్యవేక్షించారు.దీంతో తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి.

సంఘ అభివృద్ధికి చేయూత ఇవ్వాలని వినతి



మాక్లూర్: మండలంలోని కల్లెడికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ అభివృద్ధికి చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు యాదవసంఘం సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అశోక్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం

ఆర్మూర్‌టౌన్/మోర్తాడ్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సబ్‌సెంటర్ ఏఎన్‌ఎం విజయ అన్నారు. ఆర్మూర్‌లోని అశోక్ నగర్ సబ్‌సెంటర్‌లో మహిళ సంఘాల సభ్యులకు శుక్రవారం దోమల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.పట్టణంలోని 3వ, 17వ వార్డు ప్రజలకు మున్సిపల్ అధికారులు ఘనవ్యర్థ పదార్థాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ అధికారులు, ఆరోగ్యసిబ్బంది కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో అంటు వ్యా. దులు ప్రబలకుండా ఉండటానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ వెల్లడించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలని తెలిపారు. జాగిర్యాల్‌లో ఆయన పరిసరాలను పరిశీలించారు. ఇన్‌చార్జి శానిటరి ఎస్సై సురేష్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు, ఆరోగ్య సిబ్బంది, ఎంపీవో జావిద్ అలీ, కార్యదర్శి అర్చన, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో 2009–20 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు 15 కుర్చీలను శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శుభా పూర్వ విద్యార్థులను అభినందించారు. నరేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రశాంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారు’



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న నాయకులు

కమ్మర్‌పల్లి: వేల్పూర్ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నిర్వహించిన కనువిప్పు కార్యక్రమంపై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు అన్నారు. హింసకు ఆయనతో పాటు, సోదరుడు అజయ్‌రెడ్డే కారణమని ఆరోపించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, కమ్మర్‌పల్లి మండలాధ్యక్షుడు సుంకెట రవి తదితరులు మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలిపే క్రమంలో ఎమ్మెల్యే ఇంట్లోకి వెళ్లారన్నారు. ‘మానాల కడుపు చల్లబడ్డదా’ అని ఎమ్మెల్యే సోయిండే మాట్లాడారా అని ప్రశ్నించారు. డీసీసీ డెలిగేట్ తిప్పిరెడ్డి శ్రీను, వేల్పూర్, మోర్తాడ్ మండలాల అధ్యక్షులు నర్సారెడ్డి, రాములు, నాయకులు పడిగెల ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి



కిసాన్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు

బాల్కొండ/పెర్కిట్(ఆర్మూర్): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కిసాన్‌నగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ జ్ఞాన సాగర్‌రెడ్డి, జోనల్ చైర్మన్ చాకు లింగం,, క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా మొక్కలను నాటాలని ఆలూర్ ఎంపీడీవో గంగాధర్ సూచించారు. ఆలూర్‌లో వనమహోత్సవంలో భాగంగా గ్రామస్తులకు ఎంపీడీవో మొక్కలను పంపిణీ చేశారు. ఆలూర్ మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో మండల ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిశాఖ సమన్వయంతో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో శ్రీనివాస్, పలు శాఖల అధికారులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు



వేల్పూర్: ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని వేల్పూర్ మండల వ్యవసాయాధికారి శృతి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె వేల్పూర్ మండల కేంద్రంలో సాగవుతున్న ఆయిల్‌పాం పంట క్షేత్ర సందర్శన నిర్వహించారు. వేల్పూర్‌కు చెందిన రాజారపు రాజారెడ్డి ఆయిల్‌ఫాం మొక్కలు నాటి నాలుగేళ్లు పూర్తికాగా, నెల కింద గెలలు పక్వానికి వచ్చాయన్నారు. ఎకరానికి 15 క్వింటాళ్ల మొదటి కోత దిగుబడి వచ్చిందన్నారు. అలాగే మొక్కజొన్న పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమల, రైతులు పాల్గొన్నారు.

నేతల కృషితోనే హరిత హోటల్



మోర్తాడ్: తమ పార్టీ అగ్రనేతల కృషితోనే శ్రీనింబాచల లక్ష్మి నర్సింహస్వామి ఆలయం వద్ద హరిత హోటల్ నిర్మాణం కానుందని భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. శుక్రవారం భీమ్‌గల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి మాట్లాడుతూ పర్యాటక శాఖ ద్వారా రూ.4 కోట్లు మంజూరు చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కన్నె సురేందర్, జేజే నర్సయ్య, కుంట రమేష్, భోజాగౌడ్, నాగేంద్రబాబు, బద్దం అవినాష్, సుంకరి సురేష్, రాజేష్, మహేష్, శ్రీను, చిన్నారెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్తం

సీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రంలో దరఖాస్తు గడువు ముగిసిన వారం రోజుల తర్వాత మహిళల కోసం హెచ్ డబ్ల్యూ(నర్సింగ్) కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రాంగణం అధికారిణి ఇందిర శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు నిర్వహించే ఉచిత శిక్షణకు 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, కుల, ఆ దాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, 4 పాస్ పోర్టు సైజు ఫోటోలతో ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 7660022519, 7660022520 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఐఐటీ మద్రాస్ ఆన్‌లైన్ కోర్సులకు ముప్కాల్ పాఠశాల..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఐఐటీ మద్రాస్ ఆన్‌లైన్ కోర్సులకు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం గంగారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా డాటా సైన్స్, ఏఐ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఆర్కిటెక్చర్ డిజైన్, బయోలాజికల్ సిస్టమ్స్, ఫన్ విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటర్స్, తదితర కోర్సులు ఉంటాయన్నారు. ఈ ప్రోగ్రాం రెండు నెలల పాటు ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ఉంటుందన్నారు. కోర్సుపూర్తయ్యాక ఐఐటీ మద్రాస్ నుంచి విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందించబడుతాయన్నారు.

పాఠశాల నిర్వహణ అంశాలపై శ్రద్ధ వహించాలి

బోధన్: పాఠశాల నిర్వహణ అంశాల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోధన్‌ఎంఈవో నాగయ్య అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో మండల స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు.కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎం ఆరిఫోద్దీన్, ఎంఐఎస్ నగేష్, సీఆర్‌పీలు విజయ్, యూసుఫ్, విజయరేఖ, శివానంద్, దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

రాయల చంద్ర శేఖర్‌కు ఘన నివాళి

బోధన్: అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరుడు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతిని శుక్రవారం ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో ఆ సంఘం డివిజన్ కమిటీ అధ్వర్యంలో నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే సమాచారం ఇవ్వాలి

పెర్కిట్(ఆర్మూర్): మహిళలతో ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని ఆర్మూర్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్లు విఘ్నేష్, సుమతి సూచించారు. ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు నేరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం హరిత, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృత్యాధార పటం ఆవిష్కరణ

వేల్పూర్: వేల్పూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కృత్యాధార పటాన్ని హెచ్‌ఎం రాజన్న ఆవిష్కరించారు. వేల్పూర్‌కు చెందిన రిటైర్డు టీచర్ ఎం.ఎస్.ఆచార్య అక్షర పల్లకి కార్యక్రమంలో భాగంగా దీన్ని రూపొందించారు.